ఎన్నాళ్లో ఎదురుచూపులు..

- ఆరేళ్ల క్రితం మండలంగా ఏర్పాటు
- మంజూరు కాని ప్రభుత్వ జూనియర్ కళాశాల
- దూరభారంతో చదువులకు దూరమవుతున్న విద్యార్థులు
- ప్రభుత్వ స్థలాలు ఉన్నా నిర్లక్ష్యమే..


హాజీపూర్ మండల కేంద్రం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో అన్ని రకాలుగా విద్య, వైద్యంతో పాటు ప్రభుత్వ సేవలు అందరికీ అందాలనే లక్ష్యంతో 2016లో రాష్ట్ర ప్రభుత్వం హాజీపూర్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేసింది. హాజీపూర్ మండలంగా ఏర్పాటు జరిగి ఆరేళ్లు కావస్తున్నా మండలంలో కలిపించాల్సిన సౌకర్యాల గురించి మాత్రం దృష్టి సారించడం లేదు. ఈ క్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడంలో ఇటు అధికారులు అటు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలో ప్రభుత్వ కళాశాల ఏర్పాటుకు అనువైన స్థలాలు అందుబాటులో ఉన్నా మండలంలో కళాశాల ఏర్పాటు ఆలస్యం జరుగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థులకు తప్పని అవస్థలు..

హాజీపూర్ మండలంలో మొత్తం 17 గ్రామ పంచాయతీలు ఉండగా 21 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇందులో ఐదు గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఇక మండల కేంద్రంతో కలిపి మొత్తం 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలు, ఒక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ఒక ఆశ్రమ పాఠశాల, 10 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో రెండు 10వ తరగతి పరీక్షా కేంద్రాలు ఉండగా ప్రతీ ఏటా 500ల మందికి పైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు ఇంటర్ చదువుకునేలా హాజీపూర్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అందుబాటులో లేదు. దీంతో చేసేది లేక ఇంటర్ చదువుల కోసం మంచిర్యాల, లక్సెట్టిపేట మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు కానీ గురుకుల కళాశాలల్లో చదువుకునేందుకు వెళ్తున్నారు. ఇందుకు మండల కేంద్రాన్ని పరిధిలోకి తీసుకుంటే ఇటు మంచిర్యాల అటు లక్సెట్టిపేటలో కళాశాలలకు వెళ్లాలంటే దాదాపు 10 నుంచి 20 కిలో మీటర్లు ప్రయాణించి చదువులు సాగించాల్సిన పరిస్థితి. అంతే కాదు ఎంతో వ్యయప్రయాసాల కోర్చి కష్టాల మధ్య విద్యార్థులు చదువుకుంటున్నారు. దూరాభారం, ఆర్థిక భారంతో కొంత మంది విద్యార్థులు ఇంటర్ చదువులు మధ్యలోనే ఆపేసిన వారు ఉన్నారు. కొంత మంది వ్యవసాయ పనులకు వెళ్తుండగా మరికొంత మంది చేసేది లేక వివిధ వ్యాపార దుకాణాల్లో పని చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం స్పందించి వచ్చే ఏడాది విద్యా సంవత్సరంలో హాజీపూర్ మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేసి తమ ఇబ్బందులు తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటర్ మధ్యలో ఆపేసా..



మండలంలో ఇంటర్ కళాశాల లేక మంచిర్యాల, లక్సెట్టిపేట మండలాలకు వెళ్లి చదువుకోలేని పరిస్థితి. దూరం కావడంతో ఆర్థిక సమస్యలు తప్పవని చేసేది లేక 10వ తరగతి వరకు చదివి మానేశాను. ఇప్పుడు వ్యవసాయ, ఇతర కూలీ పనులకు వెళ్తూ కుటుంబ పోషణలో భాగస్వామ్యం అయ్యాను. మండలంలో ఇంటర్ కాలేజ్ ఉంటే మాత్రం చదువుకునేవాడిని. చదువు ఆపినందుకు బాధగా ఉన్నా చేసేది లేక కూలీకి వెళ్తున్న.

- జాడి సందీప్, దొనబండ, హాజీపూర్

కళాశాల ఏర్పాటు చేయాలి..



మండలంలో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ ఏడాదే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి. ఇంటర్ విద్య విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. మండలంలో చాలా మంది విద్యార్థులు ఇంటర్ కాలేజ్ లేక ఇతర మండలాల్లో చదువుకోలేక ఆర్థిక, దూరాభార సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలి.

- మందపల్లి స్వర్ణలత, ఎంపీపీ, హాజీపూర్

రోగులకు సరైన వైద్యం అందించాలి

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సేవలను అందించడంతో పాటు, ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఎమ్మెల్యే మంగళవారం సందర్శించి, రోగులతో ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు, పారిశుధ్య కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆసుపత్రిలో అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు సరైన వైద్యం అందేలా చూడాలని, పారిశుధ్య కార్మికులు ఆసుపత్రి ఆవరణతో పాటు, వార్డులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. మందుల నిల్వలను సరిచూసుకోవాలని సూచించారు. ఆర్ఎంవో శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


నస్పూర్: అద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే

నస్పూర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే దివాకర్ రావు కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని 11వ వార్డు అంబేద్కర్ కాలనీలో, 18వ వార్డు ఓల్డ్ తీగల్ పహడ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం, అద్దాలు పంపిణీ చేయడం, అవసరం ఉన్న వారికి ఆపరేషన్‌లు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు బేగం హైమద్, కోడూరి లహరి, పట్టణ కౌన్సిలర్లు వంగ తిరుపతి ఉన్నారు.

డంప్ యార్డు ఎత్తి వేయాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న బస్తీ వాసులు

బెల్లంపల్లి: ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్న డంపింగ్ యార్డును వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి కన్నాల బస్తీ వాసులు ఆందోళన చేశారు. బస్తీ శివారు నుంచి డంపింగ్ యార్డుకు చెత్తను రవాణా చేస్తున్న మున్సిపల్ వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. అరగంటకుపైగా ఆందోళన చేసి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. బస్తీకి చేరువలో డంపింగ్ యార్డు ఉండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, రాత్రి పూట చెత్త చెదారాన్ని కాలుస్తుండటంతో పొగతో దగ్గు, దమ్ముతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. వెంటనే మరో ప్రాంతానికి డంపింగ్ యార్డును తరలించాలని లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంతలోనే జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అటుగా కారులో వెళ్తూ స్థానికులను చూసి ఆగారు. డంపింగ్ యార్డుతో తాము పడుతున్న ఇబ్బందులను అదనపు కలెక్టర్‌తో వెల్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన మధుసూదన్‌నాయక్ వచ్చే జూన్ నెలాఖరు వరకు డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలిస్తామని తెలిపారు. కొత్త డంపింగ్ యార్డు కోసం నిధులు మంజూరు కాగా ప్రస్తుతం టెండర్ ప్రాసెస్ నడుస్తోందని పేర్కొన్నారు. అప్పటి వరకు ప్రస్తుత డంపింగ్ యార్డులో చెత్త కాలబెట్టకుండా చర్యలు తీసుకుని ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, చైర్‌పర్సన్ శ్వేత, కౌన్సిలర్ అఫ్సర్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి పది తరగతి వరకు ఖాళీగా ఉన్న మిగులు సీట్ల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 22 వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ నాగమల్లయ్య తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులకు ఆంగ్లమాధ్యమంలో విద్య అందించడ మే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోడల్‌స్కూల్‌లలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

జిల్లా స్థాయి చదరంగం పోటీలు

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు పుట్టిన రోజు సందర్భంగా జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు (మహిళలకు మాత్రమే) నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఆరోగ్య మేళా ర్యాలీ

దండేపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య మేళా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నులిపురుగు నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్ వైజర్ లక్ష్మణ్, సిబ్బంది విజయ పంచాయతీ కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

దండేపల్లి: మండలంలోని ముత్యంపేట ఉపసర్పంచ్ ముత్తె వెంకటేష్ మంగళవారం బీజేపీ పార్టీలో చేరాడు. ఆయనకు పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం..

దండేపల్లి: మండలంలోని చింతపల్లిలో రూ.27లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణాలకు ప్రభుత్వం అనేక నిధులు కేటాయిస్తోందన్నారు. ఉపసర్పంచ్ తిరుపతి, మాజీ ఉపసర్పంచ్, మధుకర్, నాయకులు బాపు, శ్రీనివాస్, మల్లేష్, చందు, నరేష్, వినోద్ పాల్గొన్నారు.

శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

వేమనపల్లి: మండలంలోని జక్కెపల్లి గ్రామ శివారులోని శివాలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు సువర్ణం ప్రార్థివశర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్ఛరణల నడుమ అచ్చలాపూర్, మంచిర్యాలకు చెందిన వేద పండితులు పూజల్లో పాల్గొన్నారు. గురువారం పంచముఖి హన్మాన్ , గణపతి, నాగదేవత, పార్వతి అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠించనున్నారు. మూడు రోజులు ఈ కార్యక్రమాలు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అదనపు పీపీ పోస్టుల భర్తీకి వినతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను శాశ్వత ప్రతిపాదికన వెంటనే భర్తీ చేయాలని బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సమిడ్ల రమేశ్ మంగళవారం డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి ఖాళీగా ఉన్న అదనపు పీపీ పోస్టుల భర్తీ చేపట్టాలని కోరారు.

అమర జవాన్లకు శ్రద్ధాంజలి

తాండూర్ : ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమర జవాన్‌లకు మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామగొని మహీందర్‌గౌడ్, నాయకులు కృష్ణ దేవరాయలు, విజయ్, విష్ణుకళ్యాణ్, ప్రదీప్, రాహుల్, విగ్నేష్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమర జవానులకు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ

భీమారం: తెలంగాణా గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధ మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ మాట్లాడుతూ సమాజంలో ఇప్పటికి కూడా సరైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్పంచ్ దాడి తిరుపతి పాల్గొన్నారు.

మంచిర్యాల సీఐ బదిలీ



మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణ సీఐగా పని చేసిన బి.నారాయణ్‌నాయక్‌ను నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు బదిలీచేస్తూ బెల్లంపెల్లి టౌన్ సీఐగా పని చేసిన ముస్కారాజును మంచిర్యాల సీఐగా నియమిస్తూ మల్టిజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2021 నవంబర్ 27న మంచిర్యాల సీఐగా బాధ్యతలు స్వీకరించి 15నెలల పాటు ఇక్కడ పనిచేశారు.

చామనపల్లిలో గ్రామసభ

వేమనపల్లి: చామనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ జెల్ల మొండి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీలోని పలు అభివృద్ధి పనులపై తీర్మాణాలు చేశారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలని, సుస్థిర అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని సర్పంచ్ కోరారు. ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌రెడ్డి, టీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీబంధు అమలు చేయాలి

పాతమంచిర్యాల: బీసీ కులాల సంక్షేమం కోసం బీసీబంధు అమలు చేయాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా పన్నులు చెల్లించేవారు బీసీలే అన్నారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు 80శాతం పన్నులు ప్రభుత్వానికి చెల్లిస్తున్నారని, బీసీలకు కార్పొరేషన్ రుణాలు విడుదల చేయాలని, డీనోటిఫైడ్ సంచార జాతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న బీసీలకు దళితబంధు పథకం అమలు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు జంబోజు శ్రీనివాస్, కనకరాజు, కరుణాకర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ రాజు బదిలీ


రాజు

బెల్లంపల్లి: బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ముస్క రాజు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం మల్టీజోన్ వన్ ఐజీ చంద్రశేఖర రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. రాజు స్థానంలో కొత్తగా ఎవరిని నియమించలేదు. మంచిర్యాల సీఐ బి.నారాయణను నిర్మల్ జిల్లా ఖానాపూర్ సర్కిల్‌కు బదిలీ చేసి ఆ స్థానంలో పోస్టింగ్ ఇచ్చారు. 2021 ఏప్రిల్ 7న బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వోగా రాజు బదిలీపై వచ్చారు. కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న రాజును బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వోగా నియామకం చేశారు. దాదాపు రెండేళ్ల పాటు ఇక్కడ ఆయన విధులు నిర్వహించారు.

చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

పాతమంచిర్యాల: మున్నూరు కాపు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు గొంగ్లళ్ల శంకర్ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లే భూమేష్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు నల్లశంకర్‌లు శంకర్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు సంజీవ్, నాయకులు ఖాజావియా, సాగర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు తోట తిరుపతి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కోటపల్లి: కరాటే, కూంగ్‌ఫూ పోటీల్లో కోటపల్లి మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి బైరల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కరాటే, కూంగ్‌ఫూ పోటీల్లో కోటపల్లి ఉషోదయ గ్రామర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కటా విభాగంలో నైనీషా ప్రథమ బహుమతి, అక్షిత ద్వితీయ బహుతి, రిత్విక తృతీయ బహుమతి, చందన్ తృతీయ బహుమతులు పొందినట్లు మాస్టర్ పట్టెం తిరుపతి తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను ఉషోదయ పాఠశాల హెచ్‌ఎం ఉమా అభినందించారు.

బిజినెస్ ట్రైనింగ్‌కు రాజు


ఆరుముల్ల రాజు

శ్రీరాంపూర్: వైజాగ్‌లో ఈ నెల 17నుంచి 19 వరకు ప్రెసిడెన్సియల్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో బిజినెస్‌పై శిక్షణ ఇవ్వడం కోసం శ్రీరాంపూర్‌కు చెందిన జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఆరుముల్ల రాజు ఎంపికైనట్లు జేసీఐ జోన్ అధ్యక్షుడు జేసీ విధిగుప్త మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌స్కిల్, స్కిల్ డెవలప్‌మెంట్, సొసైటీ అవర్‌నెస్, కార్పొరేట్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో శిక్షణకు రాజు ట్రైనర్‌గా ఎంపిక కావడంపై జేసీఐ జిల్లా సెక్రెటరీ గణరాజ్, వెంకటేశ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

కిష్టంపేటలో హెల్త్ మేళా

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్‌ఈవో జగదీశ్ పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలియజేశారు. అలాగే ప్రతి రోజు యోగా చేయాలని సూచించారు. క్యాన్సర్, టీబీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుర్ర రాకేష్‌గౌడ్, ఉప సర్పంచ్ కుంభం ముకుంద రెడ్డి, సబ్ యూనిట్ అధికారి పుట్ట సత్తయ్య, సిబ్బంది అశోక్, ఏఎన్‌ఎం రిబ్కా పాల్గొన్నారు.

హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర


యాత్రలో పాల్గొన్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర మంగళవారం అట్టహాసంగా సాగింది. మున్సిపాలిటీలోని నిర్వహిస్తున్న పాదయాత్ర 8వ రోజుకు చేరుకోగా, 29వ వార్డు బజారు ఏరియా ప్రాంతంలో గడపగడపకు తిరిగారు. దుకాణాలకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్యపర్చారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి పటోళ్ల సంజీవరెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు కె.సురేఖ, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిలుముల శంకర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, నాయకులు శారద, నయీమ్, మల్లేష్, సూరం రవీందర్‌రెడ్డి, బండి ప్రభాకర్, కటకం సతీష్ కుమార్, గుజ్జ రవి, పెండ రజిత, రాజన్న, చిన్నరాజం పాల్గొన్నారు.

8వ వార్డులో కాంగ్రెస్ జోడో యాత్ర

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు హాథ్ సే హాథ్ జోడో యాత్రను నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి యాత్రలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక పాలనను దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లే కనబడుతున్నాయి తప్ప అర్హులైన ఏ ఒక్కరికి డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వలేదని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. పీసీసీ సభ్యుడు నూకల రమేష్, నోముల ఉపేందర్‌గౌడ్, ముజాహిద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

చెన్నూర్: ఈ నెల 18న మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని చెన్నూర్ పట్టణ సమీపంలోని గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే ఘాట్ల వద్ద ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయడానికి మంగళవారం అధికారులు గోదావరి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయడం లాంటి విషయాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజోద్దీన్, కౌన్సిలర్లు సుధాకర్, శ్రీను, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాంలాల్ గిల్డా, నాయిని సతీష్, పెండ్యాల లక్ష్మణ్, వేముల మహేందర్, జాడి సంపత్ పాల్గొన్నారు.

శాలివాహన గ్రీన్ ఎనర్జీ కార్మికుల నిరసన


ఎండీ కొమురయ్యకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: జిల్లాలోని పాతమంచిర్యాల శివారులోని శాలివాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంట్‌కు చెందిన కార్మికులు హైదరాబాద్‌లో ఆ కంపెనీ ఎండీ మల్క కొమురయ్య ఇంటి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్ మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన 3 నెలల వేతన బకాయిలు చెల్లించాలని, ప్లాంట్‌ను మరో 10 సంవత్సరాల పాటు నడిపించాలని కోరారు. ప్లాంట్ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ ఒప్పందం చేసుకుని ప్లాంట్‌లో ఉత్పత్తి జరిగే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. దీనికి ఎండీ స్పందిస్తూ ప్లాంట్ పీపీఏ పెంచడానికి ప్రభుత్వంలో సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా కార్యదర్శి రాజు, నాయకులు సత్యనారాయణ, ఆనందరావు, శ్రీనివాస్, తిరుపతి, బుచ్చయ్య, మల్లయ్య, ఆర్.తిరుపతి, పి.సత్యనారాయణ, సుధీర్ ఉన్నారు.

అవినీతి పాలనకు చరమగీతం పాడాలి


చెన్నూర్: మాట్లాడుతున్న మల్లారెడ్డి

భీమిని: రాష్ట్రంలోని అవినీతి, నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలని భారతీయ జనాత పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ అన్నారు. మండలంలోని చిన్నగుడిపేట్ గ్రామంలో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శక్తి కేంద్రం ఇన్‌చార్జి దోని సాయికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏమాజీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని అన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు భీమయ్య, ఉపసర్పంచ్ మేకల బుచ్చయ్య, పెసరి లింగయ్య, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, కేశవరెడ్డి, రాజులాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా గోస భరోసా సభ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా గోస – బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీలోని 45,46,50 బూత్‌లలో శక్తి కేంద్ర కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుదర్శన్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కోడి రమేష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి కళ్యాణి పాల్గొన్నారు.

బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశం

చెన్నూర్: చెన్నూర్‌లోని 171, 172, 173 పోలింగ్ బూత్ శక్తి కేంద్రంలో మంగళవారం ప్రజాగోస బీజేపి భరోసాలో భాగంగా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముల్కల్ల మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కేంద్రంలో పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, స్ట్రీట్ కార్నర్ మీటింగ్ కోఆరినేటర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్, నియోజకవర్గం కన్వీనర్ అక్కల రమేష్, పట్టణ అధ్యక్షుడు సుశీల్‌కుమార్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు రాము, పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

భీమారం: రైతులకు నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కో కన్వీనర్ నగునూరి వెంకట్వేర్‌గౌడ్ ఆరోపించారు. కాజిపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమాన్ని చేపట్టింది. నియోజకవర్గం కన్వీనర్ అక్కల రమేశ్, మండల అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి దేవ పోశం ఉన్నారు.

ఐటీడీఏ ముట్టడిని విజయవంతం చేయాలి

లక్సెట్టిపేట: ఈ నెల 20వ తేదీన ఉట్నూర్ ఐటీడీఏ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్రా ఉపాధ్యక్షులు కుడిమెత తిరుపతి అన్నారు. మంగళవారం మండలంలోని ఐబీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టబద్దత లేని కులాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఆదివాసీలు సాగు చేస్తున్న భూములను ఎటువంటి షరతులు లేకుండా హక్కు పత్రాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరుగుతుందని ముట్టడి కార్యక్రమానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఆదివాసీలు హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోయం జంగు, బొజ్జె రావ్, కనక జంగు, హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

16న ప్రజాభిప్రాయ సేకరణ

శ్రీరాంపూర్: ఈ నెల 16 శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 5, ఆర్కే6 గనులకు సంబంధించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు డీజీఎం(పర్సనల్) గోవిందరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కృష్ణాకాలనీలోని శాంతి మైదానంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆర్కే 6 గని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్కే5 గనికి చెందిన ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని తెలిపారు. ఈ గనులకు సంబంధించి ఉత్పత్తి లక్ష్యాలు పెరుగడంతో నిబంధన ప్రకారం మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని చెప్పారు.

గ్రామసభలు

నెన్నెల: మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యువతకు స్వయం ఉపాధి కోసం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందజేసేందుకు నెన్నెల మండలంలోని కోణంపేట, నెన్నెల, కుశ్నపల్లి, మైలారం గ్రామాల్లో మంగళవారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు.